# అపాయింట్‌మెంట్...ప్లీజ్!



– విజయార్కె

డెంటిస్ట్ కూర్మాచలానికి మంటెక్కిపోతోంది.

విసుగ్గా వాచీ వంక చూసుకున్నాడు. సాయంత్రం ఆరూ పది హేను.

'హూ...' పెద్దగా నిట్టూర్చి అతనివైపు చూశాడు. సెలూన్‌లో షేవింగ్ చేసుకునేప్పుడు తన్మయత్వంగా కూచునే శాల్తీలా ఓ పేషెంట్. అతని ముందు పన్ను అటూ, ఇటూ సంకీర్ణ ప్రభుత్వంలా ఊగుతోంది (ట). 'పూర్తిగా పీకేయండి, లేదా ఊగకుండా చూడండి' అన్జెప్పి, అపాయింట్‌మెంట్ తీస్కొని మరీ వచ్చాడు అతగాడు!

కానీ, అవతల... లవర్స్ పార్క్‌లో తన జ్ఞానప్రసూన, తనకోసం పార్కులో గడ్డి పీకుతూ వెయిట్ చేస్తూ ఉంటుంది.

'సార్... ప...పన్ను పీ..కు..తా..రా' పేషెంట్ డాక్టర్ కూర్మాచలం వైపు చూసి అడిగాడు.

'అబ్బ... ఉండవయ్యా... నేనుంది పీకడానికే కదా...' విసుగ్గా అని, కసిగా పట్టకారు (పళ్ళు పీకేది) అందుకుని, పేషెంట్‌ని నోరు తెరవమన్నాడు. బావురుకప్పలా అతను నోరు తెరిచాడు.

కూర్మాచలం దృష్టి అంతా జ్ఞానప్రసూన మీదే ఉంది. బావురుకప్పలా నోరు తెరిచిన పేషెంట్ నోట్లో అతనికి పార్కు కనిపిస్తుంది. ఆ పార్కులో కూచోని తన కోసం ఎదురుచూస్తోన్న జ్ఞానప్రసూన కనిపిస్తుంది.

తన ఇరవయ్యేళ్ళ నిరీక్షణ, నలభై దాటాక, తన మనసును చేరుకున్న ప్రేమకథ. కూర్మాచలానికి ఇంకా పెళ్ళి కాలేదు. పెళ్ళి గురించి అతనికి కొన్ని నిశ్చితాభిప్రాయాలూ, ప్లస్ భయాలూ ఉన్నాయి. పెళ్ళయ్యాక పెళ్ళాం తనని డామినేట్ చేస్తే, లేదా తనమీద తన భార్యకి ప్రేమ తగ్గితే, సపోజ్ తనకి బట్టతల వస్తే (వస్తే ఏం ఖర్మ, ఆల్రెడీ వచ్చేసింది) అప్పుడు కూడా తన భార్య తనని ప్రేమిస్తుందా? ఇలాంటి డౌట్లతో అతను కాలం గడిపేసాడు. నలభై దాటాక గానీ తాను ఒంటరిగాడినన్న విషయం గుర్తుకు రాలేదు. అదీ జ్ఞానప్రసూన కలిశాక. డిగ్రీ అయిపోగానే లక్కీగా తన చదువుకు తగ్గట్టుగా తనో డెంటల్ క్లినిక్ ఓపెన్ చేయడం... ఆ రోజుల్లో... ఉమెన్స్ కాలేజీ పక్కనే తన క్లినిక్ ఉండడం, అబ్బాయిల పళ్ళు అమ్మాయిలు రాలగొట్టడం... అబ్బాయిలు తన క్లినిక్‌కు రావడం... అబ్బో... అలా, అలా డెవలప్ అయిపోయి, పెద్ద పేరున్న డెంటిస్ట్ అయిపోయాడు.

ఇప్పుడు డెంటిస్ట్‌గా కూర్మాచలం ట్విన్‌సిటీస్‌లో పెద్ద బిజీ పర్సన్. అతడ్ని కలుసుకోవాలంటే అపాయింట్‌మెంట్ తీసుకోవాలి. పొద్దున్నే అతని అపాయింట్‌మెంట్ కోసం జనం క్యూ కడతారు.

అలా అనుకోకుండా ఓ రోజు బ్యూటీషియన్ జ్ఞానప్రసూన తన దవడపన్ను ఏదో డామేజ్ జరిగినట్టు ఫీలయి, కూర్మాచలం దగ్గరికి వచ్చింది. వెంటనే బ్యాగ్రౌండ్‌లో 'ఎటో వెళ్ళిపోతోంది మనసు' పాట వినిపించినట్టనిపించింది!

అలా ఆమె వైపు అడ్మయిరింగ్గా చూస్తుండిపోయాడు.

'ఏడడుగుల సంబంధం... ఎన్నెన్నో జన్మల సంబంధం' అన్న పాట జ్ఞానప్రసూనకూ వినిపించింది. అది యాదృచ్ఛికం కావచ్చు. జ్ఞానప్రసూనకు పెళ్ళి కాలేదు. ఓల్డేజికి, మిడిలేజీకి మధ్య ఉన్న 'ఏజ్' ఆవిడది. పెళ్ళిళ్ళు స్వర్గంలో జరగవు. పార్కులో కుదిరి, రిజిస్ట్రార్ ఆఫీసులో జరుగుతాయని ఆవిడ నమ్మకం. పెళ్ళిచూపుల్లో కూచోవడం గిట్టకే... పెళ్ళిళ్ళు రిజెక్ట్ చేసింది. 'పోనీ నువ్వయినా చూసుకొని చావు' అని జ్ఞానప్రసూన తండ్రి అంటే, 'చూసుకొని ఛస్తే మాత్రం... ఆ వచ్చిన మొగుడు నన్ను బాగా చూసుకొని చస్తాడని గ్యారంటీ ఏమిట?'ని నిగ్గదీసేసరికి... ఆవేశంతో ఊగి ఊగి... తెలుగు సినిమాలో గుమ్మడిగారి టైపులో గుండెని ఎడమచేత్తో పట్టుకుని నేల కూలి 'హరీ'మన్నారు.

★ ★ ★

ఎదుటి వ్యక్తిని చూడగానే మనకు ప్రేమించేయాలని అనిపించాలని, అప్పుడే పెళ్ళి చేసుకుంటానని శపథం చేసి, తర్వాత ఓ బ్యూటీపార్లర్ తెరిచింది. చాలా పేరున్న బ్యూటీషియన్‌గా పేరు తెచ్చుకుంది. సినిమా స్టార్లు కూడా ఆవిడ దగ్గరకు వస్తారు.

అలాంటి జ్ఞానప్రసూన డెంటిస్ట్ కూర్మాచలం దగ్గరికి వచ్చి, ఫస్ట్ లుక్కులోనే ఫ్లాటయిపోయింది. ఆమె నోరు తెరిచింది. అతనికి ఆ నోట్లో ఎన్నో లొకేషన్లు కనిపించాయి. స్విట్జర్లాండు, ఊటీ, ఆస్ట్రేలియా... చివరికి సంజీవయ్య పార్కూ కనిపించాయి. అందులో తనూ, జ్ఞానప్రసూనా కలిసి డ్యూయెట్ పాడుకుంటున్నట్టు, వచ్చీరానీ తెలుగులో ముక్కుతో ఉదిత్‌నారాయణ్ తనకు ప్లేబ్యాక్ పాడినట్టు, ఉషాఉతుప్ జ్ఞానప్రసూనకు ప్లేబ్యాక్ ఇచ్చినట్టు... రకరకాల కలలు కనేశాడు.

తన్మయత్వంతో అన్నాడు 'ఐ లవ్ యు' అని. వెంటనే 'ఐ టూ...' అంది జ్ఞానప్రసూన.

అంతే... ఇద్దరు ఆ క్షణమే ప్రేమించేసుకున్నారు. ఆమె దవడపన్ను అతి సున్నితంగా పీకేశాడు.

'అబ్బ...' అంది అదేదో తీపి మూలుగు అయినట్టు జ్ఞానప్రసూన.

★ ★ ★

'హబ్బా...' అరిచాడు. భయంతో కెవ్వున కేకేశాడు పేషెంట్. కూర్మాచలం జ్ఞానప్రసూనను తలచుకొని, ఆవిడ దవడపన్ను పీకిన అనుభూతితో తన ముందున్న శాల్తీకి

దృఢంగా నాగార్జున సిమెంట్‌లా ఉన్న దవడ పన్ను శక్తి కొద్దీ పీకేశాడు. ఊడి బయటికి వచ్చింది. అతనికి పీకాల్సింది ముందు పన్ను. ఆ పన్ను 'నన్ను పీకలేదేంటి డాక్ట్రూ...' అని దీనంగా అడుగుతున్నట్టు అనిపించింది.

ఆ తర్వాత జరిగిన డామేజీ తలచుకొని, ఆ శాల్తీ తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టి... తి...ట్టి... ఆయాసం వచ్చి... పీకిన తన దవడపన్ను తీసుకొని వెళ్ళిపోయాడు కోపంగా!

★ ★ ★

'ఛా... ఛీ... చల్... మీతో నేను మాట్లాడనంతే...' అంటూ బుంగమూతి పెట్టింది బ్యూటీషియన్ లవర్ జ్ఞానప్రసూన.

'సారీ... ప్రసూనా డియర్... అపాయింట్‌మెంట్లు ఎక్కువయ్యాయి... ఎంత వదుల్చుకుందామనుకున్నా కుదర్లేదు. రేపు ఈవినింగ్ ష్యూర్‌గా ప్యారడైజ్ ఏసి రెస్టారెంట్‌లో కలుసుకుందాం...' అన్నాడు దీనంగా.

'సరే...' అంది జ్ఞానప్రసూన.

తథాస్తు దేవతలు ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు.

★ ★ ★

జ్ఞానప్రసూన అవాక్కయిపోయింది.

ఆమె గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి కిటికీ రెక్కల్లా...! తను క్లినిక్‌ని క్లోజ్ చేయాలనుకుని అన్ని అపాయింట్‌మెంట్లని క్యాన్సిల్ చేసుకొని, కిందికి దిగి వచ్చిందో లేదో... ఓ కారు సర్రున వచ్చి పార్కింగ్ ప్లేస్‌లో ఆగింది.

'సినిమా హీరోయిన్ చిత్రాంగి...' ఎవరో అరిచారు. సినిమా హీరోయిన్ చిత్రాంగి వచ్చేసిందంటూ!

జ్ఞానప్రసూనకు సీన్ అర్థమయింది.

'కాదురా... చిత్రాంగి దగ్గర పన్జేసే పనిమనిషి అయి ఉంటుంది. ఆ దెయ్యం ఫేసూ ఆవిడనూ...' ఓ వీరాభిమాని తన అభిమాన నటి చిత్రాంగిని, కారు దిగిన అందవికారమైన అమ్మాయితో పోల్చడం ఇష్టం లేక అన్నాడు.

నిజానికి... ఆవిడే చిత్రాంగి. కాకపోతే మేకప్ లేకుండా వచ్చింది.

'హాయ్... జ్ఞానప్రసూనా... నీ కోసమే ముంబయ్ నుంచి వచ్చా... అనుకోకుండా అమితాబ్ పక్కన ఓ పిక్చర్‌లో ఛాన్స్ వచ్చింది. రేపే షూటింగ్... ఇవ్వాళే ముంబయ్ మళ్ళీ వెళ్ళిపోవాలి... నీ మేకప్‌తో, నీ బ్యూటీటిప్స్‌తో నేను అదిరిపోవాలి... ఫ్యూచర్‌లో నేను చిత్రాంగితో తప్ప మరెవరితోను నటించనని అమితాబ్‌జీ డిక్లేర్ చేయాలి' అంది చిత్రాంగి జ్ఞానప్రసూన చేతులు పట్టుకుని!

ఏం చేయాలో తోచలేదు... అక్కడ తనకోసం తన కూర్మాచలం డియర్... ఎదురుచూస్తూ ఉంటాడు... ఇక్కడ చూస్తే తన క్లయింట్... ఆల్రెడీ వారం రోజుల క్రితం తను అపాయింట్‌మెంట్ కూడా ఇచ్చింది. హడావిడిలో ఆ విషయమే తను మరిచిపోయింది!

★ ★ ★

అన్యమనస్కంగా మేకప్ చేస్తోంది జ్ఞానప్రసూన.

హీరోయిన్ చిత్రాంగి మొహంలో తన కూర్మాచలం కనిపిస్తున్నాడు ప్యారడైజ్ ఏసి రెస్టారెంట్‌లో అసహనంగా స్పూన్లతో, ఫోర్క్‌స్పూన్లతో ఆడుకుంటూ, మధ్య మధ్య ఆర్డర్ కోసం వచ్చే శాల్తీ వంక దీనంగా చూస్తూ...

జ్ఞానప్రసూన చేతులు వేగంగా కదులుతున్నాయి. క్షణాలు... నిమిషాలు... గడిచాయి... మేకప్ పూర్తయ్యేసరికి రెండు గంటలు పట్టింది.

అప్పుడు తన్మయత్వంగా కళ్ళు తెరిచి, అద్దంలో తన ప్రతిబింబం చూసుకొని వరసగా కెవ్వు కెవ్వు కెవ్వుమంటూ అరుస్తూనే ఉంది.

ఆమె గుండెలు వేగంగా
కొట్టుకుంటున్నాయి కిటికీ రెక్కల్లా...!
తను క్లినిక్‌ని క్లోజ్ చేయాలనుకుని
అన్ని అపాయింట్‌మెంట్లని క్యాన్సిల్
చేసుకొని, కిందికి దిగి వచ్చిందో
లేదో... ఓ కారు సర్రున వచ్చి
పార్కింగ్ ప్లేస్‌లో ఆగింది. 'సినిమా
హీరోయిన్ చిత్రాంగి...' ఎవరో
అరిచారు. సినిమా హీరోయిన్
చిత్రాంగి వచ్చేసిందంటూ!

పిచ్చి పిచ్చి రంగులు... మొహం మీద పేస్ట్‌ల్లా ఉన్నాయి, చీపురుపుల్లల్లా తల వెంట్రుకలు...

చిత్రాంగి కోపంగా జ్ఞానప్రసూన వైపు తిరిగి, చూసి, తిట్టిన తిట్టు తిట్టకుండా... తన ఒరిజినల్ భాషలో తిడుతూ, తానెక్కిన ఫ్లయిట్ ముంబయ్ చేరే వరకూ వాటిని కంటిన్యూ చేసింది.

★ ★ ★

'ఇలా అయితే మన పెళ్ళి జరగదంతే...' కోపంగా పళ్ళు పటపటలాడిస్తూ అన్నాడు కూర్మాచలం.

'నేనూ సేమ్... డిటో డైలాగే' అంది జ్ఞానప్రసూన.

ఆ ఇద్దరూ ఓ రోజు... ఓ గంటయినా మనసు విప్పి మాట్లాడుకోవాలని... తమ ఫ్యూచర్ ప్లానింగ్స్ చర్చించుకోవాలని నెలరోజులుగా అనుకుంటూనే ఉన్నారు. కానీ ఇద్దరికీ కుదరడం లేదు.

డెంటిస్ట్‌గా కూర్మాచలం బిజీ.

బ్యూటీషియన్‌గా జ్ఞానప్రసూన బిజీ బిజీ.

ఇద్దరూ అపాయింట్‌మెంట్ల ఊబిలో కూరుకుపోయారు.

పొద్దున లేస్తే అపాయింట్‌మెంట్లు...

ఆ ప్రకారం క్లయింట్స్‌ని చూసేసరికి అర్ధరాత్రవుతుంది.

తమ పెళ్ళి, షష్టిపూర్తి ఒకేసారి జరుగుతాయేమోనన్న అనుమానం ఇద్దరికీ కలిగింది. దీనంగా, ఘోరంగా తయారయ్యారిద్దరూ...

చివరాఖరికి ఓ ఐడియా ఫ్లాష్‌లా వెలిగింది.

ఓ రోజు పొద్దునే కారేసుకుని జ్ఞానప్రసూన బ్యూటీ క్లినిక్‌కి వెళ్ళాడు కూర్మాచలం.

ఆ రోజు మొత్తం పది అపాయింట్‌మెంట్లూ తానే తీసుకున్నాడు. టోకెన్స్ అయిపోయాయి. ఆ రోజుకి మరే అపాయింట్‌మెంట్లు లేవని బ్యూటీ క్లినిక్ రిసెప్షనిస్టు బోర్డు పెట్టేసింది.

★ ★ ★

అదే సమయంలో జ్ఞానప్రసూన కారు డెంటిస్ట్ కూర్మాచలం క్లినిక్ ముందాగింది.

అపాయింట్‌మెంట్స్ ఫిక్స్ చేసే బోయ్ దగ్గరికి వెళ్ళి, ఆ రోజుకి ఇరవై టోకెన్లు కొని... అన్ని అపాయింట్‌మెంట్సూ తానే 'బుక్' చేసుకుంది జ్ఞానప్రసూన.

★ ★ ★

ఆ రోజు ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ బ్యూటీ క్లినిక్‌లో జ్ఞానప్రసూన ఒడిలో తలపెట్టి రెస్టు తీసుకొని బోల్డు కబుర్లు చెప్పుకున్నాడు కూర్మాచలం.

మధ్యాహ్నం రెండు నుంచి కూర్మాచలం ఒళ్ళో తలపెట్టి సాయంత్రం వరకూ కబుర్లు చెబుతూనే ఉంది జ్ఞానప్రసూన.

'చూశారా... మనిద్దరి బుర్రలకు ఎంత మంచి ఆలోచనలొచ్చాయో ఒకేసారి. నా అపాయింట్‌మెంట్స్ మీరు తీసేసుకున్నారు. మీ అపాయింట్‌మెంట్లు నేను 'ఫిక్స్' చేసేసుకున్నాను. మనిద్దరి క్లినిక్‌లకు నో క్లయింట్ టుడే... సో... మన అపాయింట్‌మెంట్ మనమే కొనుక్కున్నాం. పెళ్ళయ్యాక కూడా ఇలా వారానికోసారి మన అపాయింట్‌మెంట్స్ మనమే కొనేసుకుందాం... అప్పుడిక ఈ అపాయింట్‌మెంట్ ప్లీజ్... అని ఒకరినొకరం మన 'ప్రైవసీ'ని ముష్టెత్తుకునే అవకాశం ఉండదు. ఏమంటావ్ డియర్...' అంది కూర్మాచలం బట్టతలను ప్రేమగా నిమురుతూ జ్ఞానప్రసూన.

'అలాగే డాళింగ్' అన్నాడు ఖాళీగా ఉన్న ఆమె దవడపన్ను ప్లేసును చేత్తో మృదువుగా రాస్తూ.

★ ★ ★

హమ్మయ్య... చివరాఖరికి వాళ్ళ అపాయింట్‌మెంట్ సమస్య ఆ విధంగా సాల్వ్ అయింది.

ఇద్దరూ బిజీ కావడంతో, ఒకరి అపాయింట్‌మెంట్స్‌ని ఒకరు కొనుక్కొని... వారానికోసారి హాయిగా కలుసుకుని, మనసు విప్పి మాట్లాడుకొని, ఆ తర్వాత... ఆ తర్వాత ఏం చేసుకుంటారో మనకెందుకులెద్దురూ... ఆ 'పవర్ కట్' వ్యవహారం వాళ్ళే చూసుకుంటార్లెండి.

అన్నట్టు. ఇలాంటి బిజీ కపుల్ మీరయితే... ఈ ప్లాన్ ఓసారి అమలుచేసి చూడండి.

●